



నేటి దినపత్రిక
**సూర్య**
www.suryaa.com
**19** వ వసంతంలోకి ...
**ఎన్టీఆర్ కృష్ణా**
శనివారం 21 మార్చి 2026



# గ్యాస్ కొరత లేదు



- గ్యాస్ కోసం భయాందోళన చెందాల్సిన అవసరం లేదు
- గృహ అవసరాల గ్యాస్ పక్కదారి పట్టకుండా చర్యలు
- వాణిజ్య అవసరాలకు ప్రాధాన్యతల ప్రకారం సరఫరా
- ఏజెన్సీల పెండింగ్ సరఫరాలు, అనుమానిత లావాదేవీలపై నిఘా
- ఆయిల్ కంపెనీల్లో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నాయి
- 6 నుంచి 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటున్నాం
- ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఎక్కడా గృహ అవసరాలకు సంబంధించిన వంట గ్యాస్ కొరత లేదని, ప్రజల్లో అపోహలు, భయాందోళనలు కలిగించే వారిపై అప్రమత్తంగా ఉండాలని ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజలకు సూచించారు. శుక్రవారం కానూరు సివిల్ సప్లైస్ భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గ్యాస్ సరఫరా వాస్తవ పరిస్థితిని అంచనావేస్తున్నామని రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను మూడు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హెచ్పీసీఎల్ వంటి ప్రధాన ఆయిల్ కంపెనీలు సప్లై చేస్తున్నాయన్నారు. ప్రజల్లో నెలకొన్న అనవసర అపోహలు, భయాలను పారదోలేలా అధికారులు పని చేస్తున్నారన్నారు. మిగతా 2లో

# ప్రజా సౌకర్యమే నా ప్రాధాన్యత

**స్పెషల్ ఆఫీసర్ డా. జి. లక్ష్మీశా**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్‌గా డా. జి. లక్ష్మీశా శుక్రవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్‌లో శుక్రవారం దుర్గగుడి ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఎంసీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీఎంసీ స్పెషల్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తనను స్పెషల్ ఆఫీసర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ నగరాన్ని సీఎం ఎప్పుడు "గేట్ వే టు అమరావతిగా" పేర్కొంటారని, అందుకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రజా సౌకర్యాలను విస్తరించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి, నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు, వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. నగరాభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యత ఉన్న అంశాలను గుర్తించి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మిగతా 2లో...



# లక్షల్లో ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయం

**రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు 20 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మంత్రి నగరంలోని మిగతా 2లో...



## గత పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం..

**పాత పాలిటెక్నిక్ కళాశాల భవనం దుస్థితి!**

**నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

వివరాలు 2 లో

అంగన్‌వాడీలకు

# గ్యాస్ కష్టాలు.

**సిలిండర్ల కోసం ఎదురుచూపులు..!**

వివరాలు 2లో



(మొదటిపేజీ తరువాయి)

## ప్రజా సౌకర్యమే నా ప్రాధాన్యత



అధికారులను ఆదేశించారు. నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, ఇతర కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణలో నగర స్థాయిని నిలుపుకోవడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి, వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వివిధ శాఖలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవ స్థానం ఈవో శీనా నాయక్, అడిషనల్ కమిషనర్లు డా. డి. చంద్రశేఖర్, ఎ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. కె. అర్జునరావు, చీఫ్ ఇంజ నీర్ (ఇన్‌చార్జ్) పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, సూప రింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.విజ యలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె.శ్రీనివాస్,ఏ. శ్రీనివాసరెడ్డి, జి సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ గోపాల నాయక్, డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ కమిషనర్లు ఏ యు బి శర్మ, హెలెన్, డి ఎస్ ఎస్ శ్రీనివాస్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, మేనేజర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు గ్యాస్ కష్టాలు

**గన్నవరం, మార్చి 20, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని, సరిపడా నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. సిలిండర్లు అందక అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, గురుకులాలు, చిన్నపాటి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడటంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు అందించాల్సిన పోషకాహారం తయారీలో ఆటంకాలు తలెత్తుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల కోసం ఏజెన్సీల వద్ద రోజులు తరబడి వేచి ఉండాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు సమయానికి పోషకాహారం అందించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. మరోవైపు గన్నవరం పట్టణంలో గ్యాస్ కోసం వినియోగదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. సర్వర్ సమస్య కారణంగా సరఫరాలో ఆలస్యం జరుగుతోందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నప్పటికీ, గోదాంలలో నిల్వలు ఉన్నా స్టాక్ లేదంటూ బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇక చిన్నపాటి వ్యాపారస్తులు, హోటళ్లు, దాబాల నిర్వాహకులు కూడా నిత్య వంట కోసం సిలిండర్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ అందుబాటులో లేక కట్టెల పొయ్యిలపై వంట చేయాల్సిన దుస్థితి నెలకొంది. హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తీవ్ర గ్యాస్ సమస్య నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి, పసిపిల్లలకు పోషకాహారం అందించే కేంద్రాలకు ఎలాంటి అంతరాయం లేకుండా నేరుగా సిలిండర్ల సరఫరా జరిగేలా తక్షణ ఆదేశాలు జారీ చేయాలని బాధితులు కోరుతున్నారు.

# గ్యాస్ కొరత లేదు



(మొదటిపేజీ తరువాయి)

సోషల్ మీడియాలో కొందరు కావాలని గ్యాస్ సరఫరా విషయంలో ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా మాట్లాడుతున్నారు. దీనివల్ల ప్రజలు ఆందో ళనకు గురై ఎక్కువ బుకింగ్స్ జరుపుతున్నారన్నారు. గత వారం రోజుల్లో ఇలాంటి అపోహల వల్లనే అధికంగా బుకింగ్స్ జరిగాయన్నారు. సెప్టెంబర్ 14 న 5.04 లక్షల బుకింగ్స్ ఉండగా, ప్రస్తుతం అవి 2.96 లక్షలకు తగ్గాయ న్నారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ముఖ్యంగా గృహ అవసరాలకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సాఫీగా గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు. వాణిజ్య అవసరాలకు కూడా ప్రస్తుతానికి పెద్ద ఇబ్బందులేవీ లేవని, ఆస్ప త్రులు, పాఠశాలలు, వసతి గృహాలు, అత్యవసర సర్వీసులకు మొదటి ప్రాధా న్యం ఇస్తూ వాణిజ్య అవసరాల గ్యాస్ ను సరఫరా చేస్తున్నామన్నారు. క్రమంగా గ్యాస్ సరఫరా మరింత మెరుగయ్యేలా ప్రణాళికాబద్ధంగా సమష్టిగా పనిచేస్తు న్నామన్నారు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్యాస్ పరిస్థితులను చూస్తూ రాష్ట్రంలో గ్యాస్ ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు జరపడమేకాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వెతుకుతుందన్నారు. ప్రజలు ఎవరూ అధైర్యం చెందవద్దు అని భరోసా ఇచ్చారు. ఈ నెల 9 న ఎసెన్షియల్ కమర్షియల్ యాక్ట్ ను కేం ద్రం ప్రకటించిన దగ్గర నుండి రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతుందన్నారు. పౌర సరఫరాలు శాఖ ఆధ్వర్యంలో అన్ని వివరాలు తెప్పించుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో గతం లో రోజుకు 1 లక్ష 80 వేల వరకు, రద్దీ సమయాల్లో ఎక్కు వగా దాదాపు 1,96,000 వరకు గ్యాస్ బుకింగ్స్ జరిగాయన్నారు. 21 న మనకి రావాల్సిన నౌక 25 న రాబోతుంది అని కేంద్రం తెలియపరచిం దన్నారు. పట్టణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల నుండి పైప్ నేచురల్ గ్యాస్ కి మారేలా కొత్త పాలసీని సోమవారం సాయంత్రానికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు.. హోటల్స్ తో, రెస్టారెంట్ ప్రతినిధులతో త్వరలో సమావేశం పెడుతున్నామన్నారు. ముందుగా పాఠశాలల్లోని హాస్టల్స్, హాస్పిటల్స్ లో గ్యాస్ అందిస్తున్నామ న్నారు. దాని తరువాత తదితర రంగాలకు వాటి ప్రాధాన్యత ఆధారంగా ఇవ్వబోతున్నామన్నారు. ఆన్లైన్ ద్వారానే బుకింగ్స్ చేసుకోవాలి అని ఓటీపీ ద్వారా 100 శాతం గ్యాస్ అందేలా చేస్తున్నామన్నారు. ఓటీపీ వస్తేనే బుక్ అయినట్లు గా నిర్ధారణ చెందుతుందన్నారు. బ్లాక్ మార్కెట్ పై మీడియా లో వచ్చిన కథనాల ప్రకారం ఉక్కుపాదం మోపుతామన్నారు. రాష్ట్రం లో డొమెస్టిక్ వినియోగదారులకు అందరికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మీరు అపోహలు నమ్మి ఎక్కువ బుకింగ్స్ చేస్తే మిగతా వారికి ఇబ్బంది ఎదురవుతుందన్నారు. గ్యాస్ ఏజెన్సీస్ అన్నిటికి విజ్ఞప్తి చేస్తున్నాం, ప్రతి ఒక్కర లిస్ట్ మా దగ్గర వున్నాయి, ఎక్కడైనా గ్యాస్ పక్కదారిపడితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరిస్తున్నామన్నారు. ఇప్పటికే అలాంటి చర్యలకు పాల్పడిన 6 నుంచి 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం కిరోసిన్ కూడా అందించమని ప్రకటించిందని, త్వరలోనే కిరోసిన్ సరఫరా చేస్తామన్నారు. ఏపీ ని గతంలోనే కిరోసిన్ రహితం గా చేసామని,కానీ పరిస్థితుల దృష్ట్యా వాడకం మళ్ళీ మొదలు పెట్టాలని, ముందుగా ఏజెన్సీస్ ప్రాంతాలలో, గ్రామీణ ప్రాంతాల్లో ఇవ్వబోతున్నామన్నారు. జిల్లా స్థాయిలోనూ జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని గ్యాస్ సరఫరా వాస్తవ పరిస్థితిని అందిస్తున్నారన్నారు.

# గత పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం..

**పాత పాలిటెక్నిక్ కళాశాల భవనం దుస్థితి!**

**నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

నందిగామ,మేజర్ న్యూస్: నందిగామలోగత పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం పాత పాలిటెక్నిక్ కళాశాల భవనం దుస్థితి అని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపించారు. నందిగామ కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక భవనాన్ని శుక్రవారం పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం.. పాత పాలిటెక్నిక్ కళాశాల భవనం దుస్థితి అని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, తరగతుల ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే 1 నుండి 5వ తరగతి వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని,నందిగామ నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయని అన్నారు. శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యేలోపు విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకూడదనే లక్ష్యంతో, మధిర రోడ్డులోని పాత పాలిటెక్నిక్ కళాశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించేందుకు ఇప్పటికే అనుమతులు లభించాయనీ ఈ నేపథ్యంలో, శుక్రవారం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ తాత్కాలిక భవనాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, ఏర్పాట్లను సమీక్షించారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలు - భవన దుస్థితి**

భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడ ఉన్న అధ్వాన్నపు పరిస్థితులను చూసి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రిపేర్లు చేశామని ప్రగల్భాలు పలికినప్పటికీ, క్షేత్రస్థాయిలో భవనం పూర్తిస్థాయిలో దెబ్బతిని ఉంది. కిటికీల అద్దాలు పగిలిపోయి, తలుపులు విరిగిపోయి ఉండటం.ఫ్యాన్లు, లైట్లు వంటి విద్యుత్ ఉపకరణాలు ఏవీ పనిచేయకపోవడం. కనీసం విద్యార్థులకు అవసరమైన ఆర్వో వాటర్ ప్లాంట్ సదుపాయం లేకపోవడం. పరిసర ప్రాంతాలన్నీ చెత్తాచెదారం, మురుగునీటితో నిండి ఉన్నాయి. “జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన కేంద్రీయ విద్యాలయం మన నందిగామకు రావడం మనందరికీ గర్వకారణం. అటువంటి విద్యా సంస్థకు తగిన విధంగా ఈ తాత్కాలిక భవనాన్ని అత్యంత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి“ అని ఆమె అధికారులను ఆదేశించారు. తక్షణమే భవనానికి మరమ్మతులు చేపట్టి, రంగులు వేయించి, పారిశుధ్య పనులను పూర్తి చేయాలని నందిగామ ఎమ్మార్వో మున్సిపల్ కమిషనర్, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# లక్షల్లో ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

వారి క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతోపాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ఇటీవలే దివ్యాంగుల కోసం ఉగాది కానుకగా ముందుగానే దివ్యాంగ శక్తి పథకానికి శ్రీకారం చుట్టామని, తద్వారా దాదాపు 11 లక్షల మందికి లబ్ది చేకూరే విధంగా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. అంతకంటే ముఖ్యమైనది నిన్నటి ఉగా ది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నిరుద్యోగ యువతీ యువ కులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడంలో భాగంగా జాబ్ కాలండర్ను విడుదల చేయడం అభినందనీయమ న్నారు. నిరుద్యోగ యువత చాలా కాలంగా పోటీపరీక్ష లకు తయారవుతూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తుందా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1,2, మెగా డిఎస్సి, కానిస్టేబుల్ నియామకం తదితర పోస్టుల ద్వారా 6 లక్షల 28,347 ఉద్యోగాలు సృష్టించిందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చొరవతో ఇంకా రాష్ట్రానికి 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. దేశంలో 25% పెట్టుబడులు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావడం గర్వకారణం అన్నారు. గ్రూప్ 1,2 పోస్టులు 600, కానిస్టే బుల్ పోస్టులు 1000, ఎక్సైజ్ కానిస్టేబుల్ 400 పోస్టులు కొత్త నోటిఫికేషన్లో ప్రకటించడం అభినందనీయమన్నారు. దశలవారీగా వివిధ రకాల ఉద్యోగాలు కల్పిస్తున్నామ న్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రతి సంవత్సరం ఉద్యో గాలు ఇస్తామని చెప్పినప్పటికీ ఇవ్వలేదని, వచ్చే పరిశ్ర మలు రాకుండా వెళ్లిపోయాయని, ఉండే కంపెనీలు మూ సుకుని పోయాయన్నారు. అంతేకాకుండా యువత గంజా యి బారినపడి నిర్వీర్యమైపోయిందన్నారు. రాష్ట్రం ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రపంచానికి ఒక నాలెడ్జి హబ్‌గా కేంద్రీకృతమైందన్నారు. అందులకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవ వనరుల అభివృద్ధి ఐటీ కమ్యూనికేషన్ ఆర్టిజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుంతల రహదారులను బాగు చేశామ న్నారు రాష్ట్రంలోని అన్ని జలవనరుల జలాశయాలను నింపుకొని తేదీలు నిర్ణయించి సాగునీటిని తాగునీటిని రైతులకు ప్రజలకు విడుదల చేస్తున్నామన్నారు గల్ఫ్ లో యుద్ధం వాతావరణం ముందుగానే పసిగట్టి గ్యాస్ సిలిండర్ల కొరతను తీర్చేందుకు కృషి చేశామన్నారు. స్వాతంత్ర సమరయోధులు ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి అవసరమైన స్థలం మచిలీపట్నం నగరపాలక సంస్థలో కేటాయించేందుకు గత ప్రభుత్వ హయాంలో తీర్మానం చేయలేదన్నారు. దేశంలో మద్యం పాలసీ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉత్తమమైనదని వెల్లడించారు మచిలీపట్నం నియోజకవర్గాన్ని స్వర్ణ యుగంలో మాదిరిగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగరంలో మురుగునీటి వ్యవస్థ బాగుపరచుటకు 100 కోట్ల రూపాయల ఖర్చు చేయడం జరుగుతుందన్నారు డాక్టర్ పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మించేందుకు అవసరమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, యూనియన్ బ్యాంక్ నుండి కావలసిన నిధులు తీసుకొస్తామని స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్రిశూల వ్యూహంతో సంక్షేమం,అభివృద్ధి, బిడ్డల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ను విడుదల చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, అర్బన్ బ్యాంకు చైర్మన్ దిలీప్ కుమార్,మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు అనిత, సమత కీర్తి, స్థానిక నాయకులు వెంకటస్వామి, పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# పూర్ణ మృతి జర్నలిజానికి, నాకు వ్యక్తిగతంగా తీరని లోటు


(ఫైల్ ఫోటో)

## ఎమ్మెల్యే కుమార్ రాజా

పామర్రు మేజర్ న్యూస్: జర్నలిజం విలువలను ప్రాణంగా భావించి, నిర్భయంగా వార్తలు అందించిన ఏబీఎన్ ఛానల్ ఏపీ బ్యూరో రిపోర్టర్, సీనియర్ జర్నలిస్ట్ కేశనేని పూర్ణచంద్రరావు (ఏబీఎన్ పూర్ణ) అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల పామర్రు శాసనసభ్యులు కుమార్ రాజా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. పామర్రులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాకు కేవలం ఒక జర్నలిస్ట్ మాత్రమే కాదు, ఒక మంచి మిత్రుడు, శ్రేయోభిలాషి అని ఎన్నో సందర్భాల్లో తపకు మంచి సూచనలు, సలహాలు ఇస్తూ స్ఫూర్తిగా నిలబడి, వెన్నంటి నడిపించిన వ్యక్తి అని పేర్కొన్నారు. మంచి, చెడులను ఎప్పుడూ నిర్మోహమాటంగా, ధైర్యంగా చెప్పే ఆయన తత్వం ఎంతో గొప్పదన్నారు. వృత్తిపట్ల అంకితభావం, సమాజం పట్ల ఎనలేని గౌరవం, సమస్యలపై ఆయన అధ్యయనం చేసే విధానం ఆదర్శనీయమని పేర్కొన్నారు. తాను పనిచేసే ఛానల్ పేరునే తన ఇంటిపేరుగా (ఏబీఎన్ పూర్ణ) పిలిపించుకునేంతలా ఆయన కీర్తిప్రతిష్టలు గడించారన్నారు. ఇలాంటి విలువలతో కూడిన గొప్ప జర్నలిస్టును కోల్పోవడం పత్రికా రంగానికి, యావత్ రాష్ట్రానికి, ఆయన అభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. పూర్ణచంద్రరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

## భౌతిక కాయానికి నివాళులర్పించిన విప్ యార్లగడ్డ..



గన్నవరం, మార్చి 20, మేజర్ న్యూస్ : ఏబీఎన్ ఛానల్ బ్యూరో రిపోర్టర్ కాసనేని పూర్ణచంద్రరావు (పూర్ణ) ఆకస్మిక మృతి విషాదకరమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ శుక్రవారం ఉదయం విజయవాడ పడమటలోని పూర్ణ స్వగృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పూర్ణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు. అందరితో కలివిడిగా ఉంటూ ఏమాత్రం మొహమాటం లేకుండా నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగిన జర్నలిస్టుని కోల్పోవడం బాధాకరమన్నారు. పూర్ణ లేని లోటు ఆయన కుటుంబానికే కాకుండా జర్నలిజానికి, పేద ప్రజలకు తీరనిలోటని యార్లగడ్డ పేర్కొన్నారు.

## ఏబీఎన్ పూర్ణ మృతి బాధాకరం

**విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)**



విజయవాడ మేజర్ న్యూస్ : ఏబీఎన్ జర్నలిస్టు పూర్ణ మృతి బాధాకరమని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఏబీఎన్ - ఆంధ్ర జ్యోతి ఏపీ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేసనేని పూర్ణచంద్రరావు (ఏబీఎన్ పూర్ణ) భౌతికకాయాన్ని శుక్రవారం పడమటలంకలో ఎంపీ శివనాథ్ (చిన్ని)సందర్శించి పూలమాలేసి నివాళులర్పించారు పూర్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా...ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ...జర్నలిజంపై అత్యంత ఇష్టంతో పనిచేసిన జర్నలిస్టు ఏబీఎన్ పూర్ణ అని అన్నారు. వర్తమాన రాజకీయాలపై సంపూర్ణ అవగాహనతో పూర్ణ ఉండేవారని, ఓ జర్నలిస్ట్ గా క్షేత్రస్థాయిలో అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారన్నారు. అటువంటి జర్నలిస్ట్ ఏబీఎన్ పూర్ణ చిన్న వయసులోనే మృతి చెందటం బాధాకరం అని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) అన్నారు.

## నిబద్ధత గల పాత్రికేయుడు పూర్ణ

**భౌతిక కాయానికి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**



విజయవాడ, మేజర్ న్యూస్ : పాత్రికేయ వృత్తి లో మూడు దశాబ్దాల కాలం నిబద్ధతతో సేవలు అందించి ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరిస్తూ హుషారుగా గడిపిన కె.పూర్ణ చంద్రరావు (పూర్ణ)అకాల మరణం కలచివేసిందని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని వ్యక్తం చేస్తున్నాని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. ప్రముఖ ఛానల్ లో పనిచేస్తూ అనారోగ్యం తో బాధపడుతూ తుది శ్వాస విడిచిన కీసనేని పూర్ణ చంద్రరావు భౌతిక కాయాన్ని పటమటలంక లోని అయన నివాసం జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించి నివాళులు అర్పించారు. పూర్ణ పాత్రికేయ వృత్తి లో చురుకు గా పనిచేసేవారని అందరితో కలుపుగోలు తనం తో వ్యవహరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు.ఆయన అకాల మరణం తీరని లోటుగా భావిస్తున్నారు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించాలి







విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలని విజయవాడ నగర పాలక సంస్థ బయాలజిస్ట్ వి కామేశ్వరరావు ప్రజలతో అన్నారు. శుక్రవారం ఉదయం భవానిపురం ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వీఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయోలజిస్ట్ కామేశ్వరరావు, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రభావతి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఇన్స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్స్, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.



## కోడిపందాల శిబిరంపై దాడి..16 మంది అరెస్ట్

పామర్రు మేజర్ న్యూస్: పామర్రు మండల పరిధిలోని గాంధీ ఆశ్రమం పొలాలలో కోడిపందాలు వేస్తున్న వారిపై పోలీసులు మెరుపు దాడి చేసి 16 మందిని అరెస్ట్ చేశారు. పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. శుభాకర్, పామర్రు, కూచిపూడి ఎస్సై లు జి.విజయ్ భాస్కర్, చావా సురేష్ లు సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం మెరుపు దాడి చేసి పందెం రాయుళ్లను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో 16 మంది వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుండి 55,820 రూపాయల నగదు, ఒక కోడిపుంజు, రెండు కోడి కత్తులు, 9 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శుభాకర్ తెలిపారు. కాగా పామర్రు సర్కిల్ పరిధిలో గురువారం పెదపారుపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు గ్రామాల్లో దాడులు చేసి కోడిపందాలు, జూదం ఆడుతున్న 15 మందిని, అలాగే కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని భట్లపెనుమర్రులో దాడి చేసి కోడిపందాలు వేస్తున్న వారిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ సర్కిల్ పరిధిలో వరుస దాడులతో చిన్న స్థాయిలో జరిగే పేకాట, కోడిపందెం రాయుళ్లు బెంబేలు ఎక్కుతున్నారు. అయితే ఈ సర్కిల్ పరిధిలోని పలు గ్రామాలలో విచ్చలవిడిగా పెద్ద ఎత్తున పేకాట, కోతముక్క నడుస్తున్నా అవి పోలీసులకు కనిపించడం లేదని, కేవలం పొలాల గట్ల మీద, చెట్ల కింద ఆడుకునే చిన్న చిన్న వారిపై మాత్రమే దాడులు చేసి పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని బహిరంగంగానే ప్రజలు విమర్శిస్తున్నారు. పెద్ద ఎత్తున సాగే జూదం పై దాడులు చేయకపోవడం పట్ల పోలీసుల తీరుపై పలు అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు.

## కనకదుర్గ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



పెదపారుపూడి మేజర్ న్యూస్: మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో తుమ్మల కనకదుర్గా భవాని ఇటీవల మరణించగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా వారి గృహమునకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కనకదుర్గ భవాని చిత్రపటం వద్ద నివాళులర్పించిన కుమార్ రాజా అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), స్థానిక పిఏసిఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకట సుబ్బారావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టులో జరిమానా విధింపు




విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : ఆరోగ్య సమస్యలు సృష్టిస్తున్న వారిని కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులు గుర్తించి మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి జి. లెనిన్ బాబు విచారించి సమస్యలకు కారణమైన వారికి జరిమానా విధించారు. సర్కిల్- 1 కార్యాలయంలో శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంచార న్యాయస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై చెత్త, చెదారం వేసిన వారితో పాటు, రహదారుల పై జంతువులు, పెంపుడు కుక్కలను వదలినవారు, కాలువల్లో వ్యర్థాలు వేసి మురుగుపారుదలకు ఆటంకం కలిగించినవారు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిని గుర్తించి 8 కేసులు నమోదు చేసి వారిని జడ్జ్ ముందు హాజరుపరిచారు. విచారించిన జడ్జి వారికి జరిమాన విధించగా అధికారులు రూ. 1,570/-వసూలు చేశారు. అధికారులు ఏఎంహెచ్1 అన్నపూర్ణ,శానిటరీ సూపర్వైజర్లు డి.సోమరాజు, ఎస్ఐఎస్ శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



## శ్రీ గంగానమ్మ ఆలయ చరిత్ర..

### పోలీస్ స్టేషన్‌లోనే మొదటి పూజలు ఎందుకు..?

**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు వంతెన సెంటర్ సమీపంలో సుమారు ఐదు శతాబ్దాల కిందట గంగానమ్మ అమ్మవారు వెలిశారు. గ్రామస్తులు అమ్మవారికి చిన్న మంది రాన్ని నిర్మించి పూజలు చేశారు. కాలక్రమంలో గంగానమ్మ అమ్మవారి కోడూరు మండల ప్రజల ఇలవేల్పుగా మారడంతో ఆలయాన్ని నిర్మించారు. అయితే ఆలయ అభివృద్ధి మాత్రం అంతగా జరగలేదు. 51 ఏళ్ల కితం కోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఏవీఎస్ రెడ్డి కుమార్తెకు యాక్సిడెంట్ అయినదని కబురు వచ్చింది. ఎస్సై కుమార్తె దగ్గరకు వెళుతూ గంగానమ్మ అమ్మవారిని దర్శించి తన కుమార్తె గురించి ప్రార్థించి వేళారు. తన కుమార్తె ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడటంతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందు కొచ్చారు. గ్రామస్తులతో కలిసి ఆలయానికి అన్ని హంగులను సమ కూర్చి జాతరోత్సవాలకు శ్రీకారం చుట్టారు. జాతరోత్సావాల ప్రారంభం రోజున అమ్మవారిని తప్పనిసరిగా పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లి తొలి పూజలు చేయాలని అప్పట్లో తీర్మానించారు. అప్పటి నుంచి అమ్మవారికి కోడూరు పోలీస్ స్టేషన్ ఆఫీసర్గా ఉండే అధికారి తొలి పూజలు చేయడం అనవాయితీగా వస్తోంది. ముందుగా అమ్మవారికి పుట్టింటి వారిగా చెప్పబడే కంచర్లపల్లి వంశీయులు పసుపు, కుంకుమ సమర్పించిన అనంతరం పోలీస్ స్టేషన్లో పూజలు చేసి గ్రామోత్సవానికి శ్రీకారం చుడుతారు..

### విశేష అలంకరణలో దర్శనమిచ్చిన గంగానమ్మ..!



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు గ్రామంలో వెంచేసియున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయ ప్రధాన జాతర నేపద్యంలో శుక్రవారం అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించి తమ యొక్క మొక్కుబడులు చెల్లించుకునేందుకు వచ్చే భక్తులకు, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధర రావు తెలిపారు.

### గంగానమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబం



**కోడూరు మేజర్ న్యూస్:** కోడూరులో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారి 51 వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయ లక్ష్మి, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్- సాయి సుప్రియ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా వారిని కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీస్సులు అందించారు. అనంతరం ఉత్సవాల సందర్భంగా ఆలయం ఎదుట భక్తుల కోసం జనసేన యువ నాయకుడు బచ్చు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ శిబిరాన్ని మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన వెంకటేష్‌ను అభినందించారు.



# యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి కృషి



### వైసిపి ప్రభుత్వ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 4,100మంది నిరుద్యోగులు

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**గన్నవరం, మార్చి 20, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు యువతకు భరోసా ఇచ్చారు. నిరుద్యోగ యువతకు ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయటం పట్ల సంతోషం వ్యక్తం చేసిన యార్లగడ్డ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఈ 20 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 6,28,347 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇవే కాకుండా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో తమ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. కొత్తగా విడుదల చేసిన జాబ్ కాలండర్లో ప్రధానంగా విద్యాశాఖ, పోలీస్ శాఖలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేసి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామన్నారు. ఉన్నత విద్యలో ఖాళీగా ఉన్న 3వేలమంది జూనియర్ లెక్చరర్ల పోస్టుల భర్తీ కోసం నేడు మరోసారి డిఎస్సీ ని ప్రకటించామని, వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తామన్నారు. పరిపాలన విభాగంలో ప్రతిష్టాత్మకమైన గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల కోసం 600 పోస్టులు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఒక వెయ్యి కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వివరించారు.

ఉద్యోగాల భర్తీలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నోటిఫికేషన్ విడుదల నుండి పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ క్యాలెండర్లో స్పష్టమైన గడువు ఇవ్వటం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి ఇప్పటివరకు 30,607 డీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టుల నియామకాలు పూర్తి చేశామన్నారు. ఎమ్మెస్ఎంఈ ల నుంచి 2,48,906 మందికి ఉపాధి కల్పించామని, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1,46,627 మంది, పరిశ్రమల రంగంలో 95,174 మంది, ఫుడ్ ప్రాసెసింగ్ లో 64,035 మంది, ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్లో 13,866, పర్యాటక రంగంలో 5,028 మంది వెరసి మొత్తం 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించామని చెప్పారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామం టూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉండగా రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలను తీసుకురాక పోగా కమిషన్ల కోసం వేధించి ఉన్న పరిశ్రమలను తరిమేసారని ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ప్రకారం వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రాడ్యుయేట్లలో 24% నిరుద్యోగంతో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలవడం శోచనీయమన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఎన్సీఆర్ బి నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఉపాధి లేక 4, 100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపటంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి చంద్రబాబునాయుడు యువతకు అండగా నిలిస్తే జగన్మోహన్ రెడ్డి తన అవినీతి, అరాచక పాలనతో విద్యార్థి, యువత కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్తును నాశనం చేశారని యార్లగడ్డ మండిపడ్డారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమ పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ కు ప్రజలందరూ అండగా ఉండాలని ఈ సందర్భంగా వెంకట్రావ్ పిలుపునిచ్చారు.

# ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కుమార్ రాజా



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధి లోని వెంట్రప్రగడ గ్రామంలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యానికి, ధాతృత్వానికి ప్రతీకగా నిలిచే రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేకంగా ఉపవాస దీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ వారిపట్ల తమ ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను గుర్తు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కుమార్ రాజా స్థానిక ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకట సుబ్బారావు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# కళా రంగంలో రాష్ట్రస్థాయిలో నందిగామకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి గోపాలకృష్ణ సాయి



**నందిగామ,మేజర్ న్యూస్:** కళా రంగంలో రాష్ట్ర స్థాయిలోనే నందిగామకు మంచి గుర్తింపు తెచ్చిన వ్యక్తి గొబ్బిళ్ళ పాటి గోపాలకృష్ణ సాయి అని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఉగాది పర్వదినాన కళారత్న పురస్కార గ్రహీత బొబ్బిళ్ళపాటి సాయికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆమె కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పరాభవ నామ సంవత్సర కళారత్న పురస్కారం-2026 అందుకున్న సాయి ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. కళారంగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి గౌరవాన్ని అందుకోవడం ఎంతో గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు, కళల పరిరక్షణలో కళాకారుల పాత్ర అమూల్యమని, అలాంటి కళాకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించడం అభినందనీయమని తంగిరాల సౌమ్య అన్నారు. బొబ్బిళ్ళపాటి సాయి ఈ పురస్కారం ద్వారా నందిగామ ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకువచ్చారని, యువతకు ఆదర్శంగా నిలుస్తారని ఆమె కొనియాడారు. కళాప్రతిభకు లభించిన ఈ గౌరవం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షిస్తూ సాయి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన పలువురు పాల్గొని బొబ్బిళ్ళపాటి సాయికి శుభాకాంక్షలు తెలిపారు..







# స్వయం ఉపాధి.. సాధికారతకు పునాది..

### సాంకేతికత చేయూతతో ఆర్థికంగా ఎదగాలి

### జిల్లాలో రైజ్ కేంద్రం ద్వారా ఔత్సాహికులకు ప్రోత్సాహం

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 20, మేజర్ న్యూస్ :** స్వయం ఉపాధి.. వ్యక్తిగత స్వావలంబన, ఆర్థిక స్వేచ్ఛకు, సమాజ అభివృద్ధికి కీలక మార్గమని.. సొంతంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ద్వారా మహిళలు తమ ప్రతిభను వెలికితీసి, ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశముంటుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల అభివృద్ధి లక్ష్యంగా అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) వి కార్ట్ ఎగ్జిబిషన్, భాగస్వాముల సదస్సు శుక్రవారం విజయవాడలోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఎపావో, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జెడ్పీ మాజీ ఛైర్మన్ గద్దె అనూరాధ హాజర య్యారు. డీఆర్‌డీఏతోపాటు వివిధ మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆయా యూనిట్ల వ్యవస్థాపకులతో మాట్లాడి వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక సహాయం, శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా సమాజ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. మహిళలను పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సహించడంతో పాటు వారిని విజయం దిశగా చేయిపట్టి నడిపించడంలో అలీప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలోని గుంటుపల్లిలో రైజ్ కేంద్రం ద్వారా కూడా ఔత్సాహిక మహిళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలీప్ అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి మాట్లాడుతూ అలీప్– పే నియర్ బై మధ్య ఎంవోయూ కుదిరిందన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని.. వివిధ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ, వ్యాపార అవకాశాలు, మహిళా సాధికారత, హ్యాకథాన్, ఆర్థిక అవగాహన వంటి అంశాలపైనా చర్చోపచర్చలు జరుగుతాయని వివరించారు. ఎంఎస్ఎంఈల బలోపేతానికి, మహిళల ఆర్థిక పురోగతికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, అలీప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత నియంత్రించాలి

### ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** గ్యాస్ కొరతను నియంత్రించి మహిళల కష్టాలు తీర్చాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి డిమాండ్ చేశారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎల్పిజి కొరతతో మహిళల్లో, చిరు వ్యాపారులలోను తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. వాణిజ్య గ్యాస్ బండలు అందుబాటులో లేక పోవడం తో ఇప్పటికే అనేక హోటల్స్ మూతపడ్డాయాని అనేక మంది ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ కాల పరిమితి 23 రోజుల నుండి ఒక్కసారిగా 45 రోజులకు పెంచడం సరికాదన్నారు. కుటుంబానికి గ్యాస్ 45 రోజులు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే మహిళలు కట్టెల పొయ్యిల బాట పట్టరన్నారు. కట్టల కోసం చెట్లను నరికితే పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే 45 రోజుల బుకింగ్ కాల పరిమితిని తగ్గించాలని డిమాండ్ చేశారు. అధికారులు గ్యాస్ కొరత లేదని ప్రకటిస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉందన్నారు. ఇప్పటికే చిరు వ్యాపారాలు మూతబడ్డయని, అనేక మంది ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మంది మహిళలు కుటీర పరిశ్రమలు నిర్వహిస్తున్నారని, గ్యాస్ కొరత కారణంగా అవి మూత పడ్డాయన్నారు. యుద్ధం విరమించే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. యుద్ధం పై ప్రధాని నోరు మెదపకపోవడం సరైనది కాదన్నారు. చట్ట సభలలో కమ్యూనిస్టుల ప్రాధాన్యత లేకపోవడంతో ప్రశ్నించే వారే కరువు అవుతారని తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్ లో ఉన్న ఎంపీలందరూ స్వల్పకాలిక ప్రయోజనాలకే ఆసక్తి చూపుతున్నారని, దీర్ఘకాలిక ప్రయోజనాలపై ఎవరు ఆసక్తి చూపటం లేదని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై ప్రధాని నోరు మెదపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు కంఠంనేని జోత్స్నదేవి, హనుమానుల రాణి కుమారి, కంచర్ల ప్రభు కుమారి పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిగా ఆర్డీవో బాధ్యతలు



**పెడన, మేజర్ న్యూస్:** మున్సిపల్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్‌గా మచిలీపట్నం ఆర్డీవో కె.సాంబశివరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెడన మున్సిపల్ కమిషనర్ డి కొండయ్య ప్రత్యేక అధికారికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్పెషల్ ఆఫీసర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉత్తమ క్రీడా శిక్షకుడిగా గౌరవం పొందిన విజయ్ గోగులమూడి



**గన్నవరం, మార్చి 20, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం చిన్న ఆవుటపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాయామ ఉపాధ్యాయులు, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు విజయ్ గోగులమూడి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులుగా పురస్కారాన్ని అందుకున్నారు. నేచర్ సేవా ఫోడేషన్ వారు ప్రతి ఏటా ఉగాది పార్వదినాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో విశేష సేవలందించిన వారిని గుర్తించి పురస్కారలను ఇస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన క్రీడా రంగంలో విశేష సేవలు అందించిన విజయ్ గోగులమూడి గురించి మాట్లాడుతూ.. శరీరానికి కష్టం, మనసుకు పట్టుదల, మైదానంలో రక్తాన్ని చెమటగా మార్చే వేళ, దేశ ప్రతిష్టను ఆకాశమంత ఎత్తున నిలిపే వేళ క్రీడలే జీవిత గమ్యంగా విజయ్ ప్రయాణం సాగిందని అన్నారు. ఎంతో మంది మట్టిలో మాణిక్యలైన విద్యార్థినీ, విద్యార్థులను వెలికి తీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దిన విజయ్ సత్కారించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్బంగా విజయ్ కుమార్, సుమలత దంపతులను దుస్సాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందచేశారు. అనంతరం విజయ్, సుమలత దంపతులను వేద పండితులు వేద మంత్రాలతో వేదాశ్రీవాదములు అందచేశారు.



## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి కాగిత వెంకట్రావు మురాల ఫణి

**పెడన, మేజర్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు మాజీ చీఫ్ విప్ టి టి డి మాజీ ఛైర్మన్) కాగిత వెంకట్రావు 74వ జయంతి పురస్కరించుకొని కొంతమంది నిరుపేదలకు ఆహార పట్నాలను అందించడం జరిగిందని పెడన మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు మురాల ఫణి తెలిపారు. ఈ మేరకు పట్టణంలో తామరచెరువు గవర్నమెంట్ హాస్పిటల్ పక్కన నివాసం ఉంటున్న యానాద కుటుంబాలకు శాఖాహారం భోజన ప్యాకెట్లు అందజేశామన్నారు. ఈ సందర్భంగా మురాల ఫణి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు అని తండ్రికి తగ్గ తనయుడుగా తండ్రి అడుగుజాడలలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రజాసేవలో తనదైన శైలిలో మమేకమై గడుపుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో 18వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ సేనాపతి అజయ్ సేనాపతి పండు (పైడి)తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బోండా





**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** సెంట్రల్ నియోజకవర్గంలోని 58వ డివిజన్, 62వ డివిజన్ పాయికాపురంలో శుక్రవారం శ్రీ నాగ నూకాంబిక అమ్మవారి ఆలయ 42వ వార్షికోత్సవ మహోత్సవంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతుండగా స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ధార్మిక విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ధార్మిక, సామాజిక కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయితీని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

**ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్నులన్నీ చెల్లించాలి**

**జిల్లా కలెక్టర్, మచిలీపట్నం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డీకే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్నులన్నీ చెల్లించాలని జిల్లా కలెక్టర్, మచిలీపట్నం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ నూతన ప్రత్యేక పాలనాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై ఉన్న వడ్డీని 50% రాయితీ కల్పించిందన్నారు. ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలన్నిటిని ఈనెల 31వ తేదీలోగా చెల్లించిన ఎడల వారికి వారు చెల్లించవలసిన వడ్డీలో 50 శాతం రాయితీ వర్తిస్తుందని కలెక్టర్ వివరించారు. నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆస్తి పన్నులన్నీ త్వరగా చెల్లించిన యెడల నగరపాలక సంస్థ ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. అప్పుడే నగరంలో పలు పౌర సేవలు అందించుటకు అవకాశం లభిస్తుందన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీ గంగానమ్మ జాతర నేపథ్యంలో కోడూరు వంతెన సెంటర్లో మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవనిగడ్డ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పాల్గొని





మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వైయస్ రాజశేఖర్రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు పరిసే మాధవరావు, బడే గంగాధర్, వెన్న ప్రసాద్, పోతన నాగరాజు, దావు. శివకృష్ణ బండే నాగరాజు, కోట పద్మావతి వరప్రసాద్, మాలే నరేష్, యార్లగడ్డ ఓంకార్, కాగిత సువర్ణ రాజు, యాదవ రెడ్డి కుశాల్ రావు, ఆకురాతి. తాతయ్య, షేక్ షాబు, యాకోబు, తదితరులు పాల్గొన్నారు.

## కూసం ఫౌండేషన్ చలివేంద్రం ప్రారంభం




**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పక్కనున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం(కూసం వారి హనుమాన్ ఆలయం) ప్రాంగణంలో భక్తులు, ప్రయాణీకులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు కూసం ఫౌండేషన్ చలివేంద్రం(ఉచిత చల్లని తాగునీటి సేవ) ను గురువారం ప్రారంభించారు. వేసవి కాలంలో భక్తులకు, ప్రయాణికులకు చల్లని తాగునీటి అవసరాన్ని ఈ ఫౌండేషన్ వారు తీరుస్తున్నారు. వేసవిలో ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడం ద్వారా ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా పెట్టుకొని అందరికీ తాగునీరు అందుబాటులో ఉండేలా చేస్తున్నారు. ఈ మహోన్నత సమాజ సేవా కార్యక్రమం చేపట్టిన కూసం ఫౌండేషన్ అధినేతలు కూసం కృష్ణ మోహనరావు, కృష్ణంరాజును ఈ సందర్భంగా భక్తులు, పెద్దలు అభినందించారు.

# ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్న ప్రభుత్వం కూటమే..



**విజయవాడ మేజర్ న్యూస్ :** నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని టి ఎన్ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి చరణ్ సాయి యాదవ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూర్ అన్నారు. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయని విధంగా ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ.... తెలుగు నాడు విద్యార్థి సంఘం (టీ ఎన్ ఎస్ ఎఫ్), తెలుగు యువత ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంటరీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంచి హర్షాధికాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. చరణ్ సాయి యాదవ్ మాట్లాడుతూ....రాష్ట్ర మంత్రి, యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నూతన జాబ్ క్యాలెండర్ లను విడుదల చేస్తుండటం హర్షణీయం అన్నారు. గడిచిన 20 నెలల్లోనే 2,83,375 ఉద్యోగాలు ఇచ్చి నిబద్ధత చాటుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఆంధ్రరాష్ట్రంలో నిరుద్యోగతను రూపుమాపాలనే నినాదంతో 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు. త్వరలోనే గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలతో పాటుగా మిగిలిన లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ పరంగా నోటిఫికేషన్లు విడుదల జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి ఉన్న సమయంలో ఎన్ సి ఆర్ బి నివేదిక ప్రకారం 4100 నిరుద్యోగ యువత ఆత్మహత్య చేసుకున్నారని, నిరుద్యోగ యువతకు జగన్ పాలనలో ఉద్యోగ కల్పన కరువైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల మందికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వ ఒప్పందాలు చేసుకుందన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఒక్క డీఎస్సి కూడా నిర్వహించలేకపోయారంటూ ఎద్దేవా చేశారు. వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఇచ్చిన స్క్రిప్టునే ఇప్పటికీ జగన్ మోహన్ రెడ్డి చదువుతున్నాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మనస్పర్ధలు వస్తాయని వైసీపీ కార్యాలయంలో జరిగిన ఉగాది పంచాంగంలో జగన్ చెప్పించారని, ఇది అత్యంత హాస్యాస్పదం అన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య సఖ్యత ఎన్నటికీ చెక్కుచెదరదన్నారు. జగన్ ను తన సొంత చెల్లెలు షర్మిల శత్రువుగా పోల్చిందని, జగన్కు ఇంతకంటే అవమానం ఏమైనా ఉందా..? అంటూ ఎద్దేవా చేశారు. జగన్ త్వరలోనే మరోసారి జైలుకు వెళ్లడం ఖాయం అని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలుగు యువత ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ నాగూర్ మాట్లాడుతూ...నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను ప్రభుత్వం కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా తెలుగు యువత పక్షాన ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. దేశంలోనే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేస్తున్న ఏకైక ప్రభుత్వం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మాత్రమే అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు పులిపాటి రాజకుమార్, పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు ఆర్ మాధవ్, తూర్పు నియోజకవర్గం అధ్యక్షులు రాజేష్, నాయకులు అల్లాడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్..

**రూ.2.38 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే**



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం విజయవాడలోని తన కార్యాలయంలో విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామానికి చెందిన నడకుదిటి పూర్ణచంద్రరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ ఎం ఆర్ ఎఫ్) నుంచి మంజూరైన రూ.2,38,244 ఎల్ఓసి పత్రాన్ని ఆయన అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక సహాయం కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. కష్టకాలంలో ప్రభుత్వం స్పందించి ఇంతటి ఆర్థిక సహాయం అందించడం పట్ల లబ్ధిదారుని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# జనం మెచ్చిన నేత కాగిత వెంకట్రావు జయంతి వేడుకలు





**పెడన,బంటుమిల్లి, గూడూరు మేజర్ న్యూస్ :** జనం మెచ్చిన నేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన మాజీ దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు, మాజీ చీఫ్ విప్, టి టి డి మాజీ చైర్మన్ కాగిత వెంకట్రావు 74వ జయంతి వేడుకలు నియోజకవర్గం మొత్తం అన్ని మండలాలలో ఘనంగా నిర్వహించడం జరిగిందని మాజీ పార్లమెంట్ సభ్యులు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, జిల్లా టీడీపీ అధ్యక్షులు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు మండలంలో వివిధ ప్రాంతాలలో రోగులకు పళ్ళు పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగిత వెంకట్రావు తనయుడు ప్రస్తుత నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మా నాన్న ఆశీస్సులే నాకు శ్రీరామరక్ష అని తెలిపారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ నాయకులు కార్యకర్తలతో కలసి తన తండ్రి వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగ సభలో కొంతమంది టిడిపి నాయకులు మాట్లాడుతూ కాగిత నియోజకవర్గానికి కాకుండా రాష్ట్రానికి చేసిన సేవలు పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతు భాగోద్వేగం చెందారు. తన తండ్రి జ్ఞాపకాలను నెమరేసుకుని కన్నీరు పెట్టుకున్నారు.తన తండ్రి స్నేహితులు తనకు ఎంతో నేర్పారని, పేదవాడికి ఉపాధి చూపాలని మా తండ్రి నేర్పారన్నారు,నేను ఎమ్మెల్యే కావడం నా కల అని, 2014లో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే సీటు కోసం ఆనాటి నుండి కష్టపడ్డానని, నాటి నుండి నేటి వరకు నాకు కొండంత అండగా నిలబడిన నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు నాకు ఎమ్మెల్యే సీటు రావడానికి తెర ముందు, తెర వెనుక ఎంతో మంది కష్టపడ్డారని,ఎన్నో అవమానాలు,ఎన్నో కష్టాలు, ఎన్నో బాధలు పడుతు నాకు అండగా నిలిచారన్నారు. మీ అందరి ఆశీస్సులతో నేను ఎమ్మెల్యేగా గెలిచి మీ అందరి రుణం తీర్చుకోలేనిదని,మా నాన్న ఆశయాలను నేను కొనసాగిస్తా,మీ అందరి ఆశీర్వాదం, ముఖ్యమంత్రి చంద్రబాబు దీవేనలు నాకు ఉంటాయన్నారు..బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ అని, తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ ఎవరికీ దక్కని అవకాశం మా నాన్న అనేక పదవులలో పనిచేసే అవకాశం అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కాగిత కుటుంబ అభిమానులు, పెడన నియోజవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు భరోసా కూటమి ప్రభుత్వం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి తన విశ్వసనీయ తను చాటుకున్నారని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు కొనియాడారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ హామీ ఇచ్చినా దానిని తుచా తప్పకుండా అమలు చేస్తారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైకాపా ఏలుబడిలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా దిగిపోయిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువత సంక్షేమం కోసం ఒక అడుగు ముందే ఉంటున్నారని, నిరుద్యోగుల కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు .చదువుకున్న యువత ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లకుండా, స్వదేశంలోనే స్థిరపడాలనే సంకల్పంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన వివరించరు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం వల్ల నిరుద్యోగులకు స్పష్టమైన భరోసా లభిస్తోందని రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,, మంత్రి నారా లోకేష్‌లకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యువత అంతా కూటమి ప్రభుత్వం పట్ల పూర్తి సంతృప్తితో ఉన్నారని వారు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి బసవేశ్వర రావు,నాగాయలంక చలపల్లి మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు పార్టీ నాయకులు మండలి రామమోహన రావు,ఘంటసాల రాజమోహనరావు , గుత్తికొండ వంశీ, ఉప్పల ప్రసాద్, తాడేపల్లి పాపారావు, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వశాంతిని కాంక్షిస్తూ తలపెట్టిన శ్రీమన్నారాయణ మహాయజ్ఞం సఫలం కావాలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దేశాల మధ్య ఐక్యత వెల్లివిరియాలని విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించ తలపెట్టిన శ్రీమన్నారాయణ మహాయజ్ఞం సఫలం కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోడూరు మండలం ఉల్లిపాలెంలోని శ్రీమన్నారాయణ స్వామి వారి దేవస్థానంలో ఏప్రిల్ 19-29 తేదీల్లో రాజగోపుర కుంభ ప్రోక్షణ శ్రీమన్నారాయణ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనేక దేశాల్లో యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో యజ్ఞ ప్రభావంతో ప్రపంచ దేశాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలనే ఉన్నత ఆశయంతో చేపట్టిన ఈ యజ్ఞాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాచీన దేవాలయాలకు నిలయమైన దివిసీమలో ఉల్లిపాలెం దేవాలయాన్ని ఆధునిక దేవాలయంగా అభివృద్ధి చేసిన అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి ప్రశంసనీయులన్నారు. వారు సన్యాస ఆశ్రమం చేపట్టి 25ఏళ్ళు పూర్తి కావస్తున్న సందర్భంగా చేపట్టిన ఈ మహా యజ్ఞ ఫలంతో విశ్వశాంతి స్థాపన జరగాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగే ఈ ఈ కార్యక్రమానికి త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామితో పాటు,



ప్రతిరోజు అనేకమంది స్వామీజీలు విచ్చేయనున్నట్లు తెలిపారు. త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ దేవస్థాన ప్రాంగణంలో తొలి రోజు ప్రారంభ కార్యక్రమం, నవాహ్నిక దీక్షతో తొమ్మిది రోజులపాటు 13యాగశాలలు, 108 హోమ గుండాలు, ఇష్టి హోమ గుండాలు, కోటి అష్టాక్షరి మంత్ర హవనంతో శ్రీమన్నారాయణ మహా యజ్ఞం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యజ్ఞఫలంతో విశ్వశాంతి స్థాపన జరగాలనే ఆకాంక్షతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో కర్నూలుకు చెందిన నాగరాజు గుప్తా, పాంచజన్య గీతా పారాయణ సంఘం సభ్యులు ఉల్లి గురురంగ ప్రసాద్, అన్నం సురేంద్రనాథ్, బూరగడ్డ హరినాథ బాబు, కోట సత్యనారాయణ, మద్దాలి ప్రసాద్, కోట వెంకట సుబ్బారావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, బండే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా " కాగిత వెంకట్రావు జన్మదిన వేడుకలు

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** దివంగత కాగిత వెంకట్రావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్తమూరు గ్రామం లో కీర్తిశేషులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ విప్, టీటీడీ మాజీ చైర్మన్ కాగిత వెంకట్రావు 74వ జయంతి వేడుకల్లో వారి కుమారుడు, పెడన శాస న సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరికీ శుభాకాంక్షలు. నెల పొడువు (చంద్ర దర్శనం)తో ముగిసే ఈ పవిత్ర మాసం ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో అత్యంత నిష్ఠగా ఉంటారు. ఆత్మపరిశీలన, నియమ నిష్టలు, సహనశీలతను పెంపొందించి, మానవత్వానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. రంజాన్ మాసంలో ఆచరించే ఉపవాసాలు కేవలం ఆహార నియమాలకు మాత్రమే పరిమితం కాకుండా, మన ఆలోచనలు, ప్రవర్తనలను కూడా శుద్ధి చేసుకునేవిగ నిలుస్తాయి. పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం, క్షమాభావం వంటి గొప్ప విలువలను ఈ పవిత్ర మాసం సమాజంలో విస్తరింపజేస్తుంది. అవసరమైన వారికి సహాయం చేయడం, పేదల పట్ల దాతృత్వ భావనను పెంపొందించడం రంజాన్ యొక్క ముఖ్య సందేశం.సమాజంలో ఐక్యత, శాంతి, సౌహార్ద వాతావరణం నెలకొల్పడంలో రంజాన్ మాసం కీలక పాత్ర పోషిస్తుంది. రంజాన్ పర్వదినం సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా జీవిస్తూ పరస్పర గౌరవంతో ముందుకు సాగాలి. ఈ పవిత్ర సందర్భంలో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈద్ పర్వదినం ప్రతి ఇంటికి ఆనందం, ఐశ్వర్యం కరిగించాలని ఆకాంక్షిస్తున్నాను.అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

## ప్రతి గ్రామంలో ఉత్సాహంగా జనసేన సభ్యత్వ నమోదు

### నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్

**కోడూరు మేజర్ న్యూస్:** జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రతి గ్రామంలో ఉత్సాహంగా జరుగుతోందని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం కోడూరులోని జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని వెంకట్రామ్ సందర్శించారు. పార్టీ నాయకులు, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న సాధకులతో సమావేశయ్యారు. మండలంలో సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. పార్టీ అధిష్టానం సభ్యత్వ నమోదు గడువు పొడిగించిన నేపథ్యంలో మరింత ఉత్సాహంగా రెట్టింపు సభ్యత్వాలు చేసేందుకు సాధకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వెయ్యికి పైగా, 500 పైగా సభ్యత్వాలు నమోదు చేసిన సాధకులను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ ఉద్యమి సభ్యత్వాలు స్వీకరించేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చిన యువకులను పార్టీలోకి ఆహ్వానించి వారికి సాధకుల ద్వారా పార్టీ సభ్యత్వాలు అందించారు.

## నేడు వీరవల్లిలో సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు

**హనుమాన్ జంక్షన్, మార్చి 21, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో ఉన్న శిరిడి సాయిబాబా ఆలయం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నేడు (శనివారం) ఘనంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బాబా వారికి అష్టోత్తర పూజ, పుష్పాలంకరణ పూజ, భజన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులందరికీ అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, బాబా ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోడే బోయిన బాబి, రావి ఈశ్వర్ కోరారు.



## అవార్డు గ్రహీతలను సన్మానించిన సర్పంచ్ విజయ్

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీలో జరిగిన గ్రామసభలో అవార్డు గ్రహీతలు పంచాయతీ కార్యదర్శి బట్టు అనిత, పుష్ప దీవెనలను సర్పంచ్ దాసరి విజయకుమార్ ఘనంగా సత్కరించారు. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా ఉత్తమ కార్యదర్శిగా ఎంపికైన అనిత, ఉత్తమ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంపికైన టీ పుష్ప దీవెనలను సర్పంచ్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, డిఆర్పి బాలకృష్ణ టి ఏ కిరణ్, చెన్ను రమేష్ జూనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ పంచాయతీ సిబ్బంది గ్రామ సచివాలయ సిబ్బంది పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. విజయవాడ లయోలా కళా శాలలో ఈ నెల 2వ తేదీన నిర్వహించిన తైక్వాండో బెల్ట్ టెస్ట్‌లో చల్లపల్లికి చెందిన విద్యార్థులు ఎ.కార్తికేయ, ఎ.హేమరాజు, వై.అఖిల్ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈ సందర్భంగా అవనిగడ్డలోని తమ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వారిని అభినందించారు. పవన్ తైక్వాండో & జిమ్ సెంటర్ కోచ్ కందుల పవన్ మాట్లాడుతూ దక్షిణ కొరియాలోని ప్రపంచ తైక్వాండో ప్రధాన కార్యాలయం 'కుక్కివన్' నుంచి వీరికి లభించిన బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందాయని తెలిపారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులకు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, శుభాకాంక్షలు తెలియ చేసారు.ఈ రంజాన్ పర్వదినాన్ని మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకుంటూ, అందరితో సోదర భావంగా వెలుగుతూ ఘర్షణలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం అంతా ముస్లింలందరూ నెలరోజుల పాటు నియమనిష్ఠలతో, కఠోర ఉపవాస దీక్షతో అల్లాహ్ ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారు. అల్లాహ్ రక్షణ, కరుణ పొందుటకు రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, బీద, ధనిక అన్న తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత సాయం చేస్తూ సేవా దృక్పథాన్ని, చాటుతూ ఈ పండుగను జరుపుకుంటారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాస విశిష్టత అని, సర్వమత ఐకమత్యానికి, సద్భావన, సర్వమానవ సమతకు ప్రతీక అని పేర్కొన్నారు.ఈ రంజాన్ పర్వదినం ముస్లిం సోదరుల కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వెల్లివిరియాలని, అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ ఐక్యమత్యంతో, కుల మతాలకు అతీతంగా సోదరభావంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## మునిగిన పంటల సంరక్షణకు నిపుణుల సూచనలు

**జగ్గయ్యపేట రూరల్, మార్చి 20, మేజర్ న్యూస్ :** మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి, మొక్కజొన్న పంటలను కాపాడుకోవడానికి రైతులు తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని గరికపాడు గ్రామంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, జగ్గయ్యపేట వ్యవసాయ సహాయ సంచాలకులు సి.భవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటలో గింజ రంగు మారకుండా ఉండేందుకు లీటరు నీటికి 1 గ్రాము కార్బండెజిమ్ లేదా 2 గ్రాముల కార్బండెజిమ్ + మాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి పిచికారీ చేయాలని అన్నారు. చేను పడిపోయి వారం రోజులకన్నా ఎక్కువగా నీట మునిగితే గింజ మొలక వచ్చే ప్రమాదం ఉన్నందున దాని నివారణకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని వారు సూచించారు.

మొక్కజొన్న పంట గింజ గట్టిపడే దశలో పొలంపై పడిపోతే తెగుళ్ల నివారణకు ఎకరాకు 400 గ్రాముల సాఫ్ (కార్బండైజిమ్ + మంకోజెబ్) ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.లేత పంట కోలుకోవడానికి ఎకరాకు 13:0:45 లేదా యూరియా (లీటరుకు 5 గ్రాములు) కలిపి పిచికారీ చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు చల్లడానికి డ్రోన్లను ఉపయోగించుకోవడం రైతులకు ఎంతో శ్రేయస్కరమని అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు పాడైన పంటలు



## రైతులను పరామర్శించిన డాక్టర్ జగన్మోహనరావు

**నందిగామ, మేజర్ న్యూస్ :** మండలంలోని చందాపురం, కేతవీరునిపాడు, కంచల, ఐతవరం, కీసర గ్రామాలలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలుల వలన నష్టపోయిన మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంట పొలాలను మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు రైతులు, గ్రామస్తులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం నాయకులతో కలిసి శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అకాల వర్షాలతో పాడైన పంటలను ప్రభుత్వ అధికారులు ఇప్పటివరకు పరిశీలించలేదని, పంట నష్టంకూడా అంచనా వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజన నమోదులో వ్యవసాయ, ఉద్యాన వన అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం వలన, వారి అలసత్వం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అపరాలు పెసలు, శనగలు, మొక్కజొన్న వంటి పంటలు మద్దతు ధరకు రైతులు అమ్ముకోవాలంటే స్థానిక తెలుగుదేశం నాయకులు రైతుల వద్ద నుండి కమిషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో అల్లాడుతున్న మొక్కజొన్న రైతు

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారులు





**వత్సవాయి, మార్చి 20 మేజర్ న్యూస్ :** మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు, ఈదురు గాలుల బీభత్సానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖాధికారులు శుక్రవారం పరిశీలించారు. వత్సవాయి మండలంలోని మక్కపేట, భీమవరం గ్రామాల్లో పర్యటించిన అధికారులు, నేలకొరిగిన పంటను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి డి యం యఫ్ విజయకుమారి, జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. భవాని ఈ పర్యటనలో పాల్గొన్నారు. గాలి వాన ధాటికి మొక్కజొన్న పంట ఏ దశలో దెబ్బతిన్నది, ఎంత మేర నష్టం వాటిల్లింది అనే అంశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే రైతులు అధైర్యపడకుండా శాస్త్రీయ పద్ధతుల్లో తక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని సూచించారు. పంట కోలుకోవడానికి, తెగుళ్లు సోకకుండా ఉండటానికి అధికారులు ఈ క్రింది సూచనలు చేశారు. గింజ కట్టే దశలో ఉన్న మొక్కజొన్న గాలికి పడిపోతే, తేమ కారణంగా తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు ఎకరాకు 400 గ్రాముల సాఫ్ (కార్బండైజిమ్ + మంకోజెబ్) మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేత దశలో ఉన్న పంట కోలుకోవడానికి ఎకరాకు 13:0:45 లేదా యూరియాను (లీటరు నీటికి 5 గ్రాములు) కలిపి పిచికారీ చేయాలి పంట పడిపోయిన స్థితిలో మామూలు పిచికారీ కష్టమవుతుంది కాబట్టి, డ్రోన్లను ఉపయోగించి మందులు చల్లడం ద్వారా సమయం ఆదా అవ్వడమే కాక, ప్రతి మొక్కకూ మందు అందుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. సత్యనారాయణ, పిఏసిఎస్ అధ్యక్షులు సత్తి బేతోలు, డైరెక్టర్ కట్ట దశరథ రామారావు, షేక్ కాసుమిల్లా, షేక్ బాజీ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎన్. చక్రవర్తి, జి. అరవింద్, ఎస్. ఫణి కంఠసాయి, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంగానమ్మను దర్శించుకున్న మండలి వెంకట్రామ్








**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరులో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ తల్లి అమ్మవారి 51 వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా వారిని కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఆలయ పెద్దలు, అర్చకులు అమ్మవారి ఆశీ స్సులు అందించారు. అనంతరం ఉత్సవాల సందర్భంగా ఆలయం ఎదుట భక్తుల కోసం జనసేన పార్టీ యువ నాయకుడు బచ్చు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ శిబిరాన్ని మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన బచ్చు వెంకటేష్‌ను వెంకట్రామ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, పార్టీ కోడూరు పట్టణ అధ్యక్షుడు కోట రాంబాబు, కోడూరు, లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం పిఏసిఎస్ ఛైర్మన్లు పూతబోయిన కరుణ్ కుమార్, కోట సుబ్బారావు, రేపల్లె పిచ్చేశ్వరరావు, డైరెక్టర్లు తోట సోమశేఖర్, మంగళగిరి శ్రీనివాసరావు, జరుగు ఆదినారాయణ, మాజీ డీసీ వైస్ ఛైర్మన్లు గుడిసేవ సూర్యనారాయణ, కాగిత రామారావు, మాజీ కేడీసీసీబీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, పార్టీ నాయకులు కడవకొల్లు మల్లి, అప్పికట్ల వినోద్, మల్లా వెంకటేశ్వరరావు, బచ్చు పూర్ణచంద్రరావు, పెద్ది బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంట

## రైతులకు ఎకరాకు 20 వేల రూపాయల పంట నష్ట పరిహారం చెల్లించాలి

**వత్సవాయి మేజర్ న్యూస్ :** వత్సవాయి మండలం పోలంపల్లి, పెంటలేవారి గూడెం, డబ్బకుపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పంటను రైతు, కౌలు రైతుల సంఘాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ఎకరాకు 20 వేల రూపాయలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలని, మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు టి. రమేష్, కే. వెంకటేశ్వర్లు, జి.కృష్ణా, వై.వెంకటరత్నం, ఎ.మల్లికార్జున రావు, రైతులు కనకయ్య, గోపాలరావు, కె. శ్రీనివాసరావు, పి. జగన్నాధం, సిఐటియు నాయకులు బి.రాము తదితరులు పాల్గొన్నారు.

# పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ కావాలా..?

**91549 70454 నంబరుకు కాల్ చేయండి**

**ప్రయోజనాలతో పాటు పూర్తివివరాలు తెలుసుకోండి**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, మార్చి 20, మేజర్ న్యూస్ :** జిల్లాలో ఎవరికైనా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ కావాలనుకుంటే కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454) నంబరుకు కాల్ చేయొచ్చని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గృహాలు, హోటళ్లు, పారిశ్రామిక యూనిట్లు తదితరాలకు సురక్షితమైన, నిరంతర గ్యాస్ సరఫరా అందించేలా పీఎన్‌జీ కనెక్షన్లకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. పీఎన్‌జీ ప్రయోజనాలతో పాటు పూర్తి వివరాలను ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న సిబ్బంది వివరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గ్యాస్ సరఫరా స్థితిగతులు, భవిష్యత్తు కార్యాచరణ తదితరాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సరఫరా వ్యవస్థను కొనసాగించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. గౌరవ సీఎం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దన్నారు. పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు సుస్థిర భవిష్యత్తు ఇంధన భద్రతకు సోపానాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999